క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వరప్రసాద్ రావు

బేతంచెర్ల: గ్రామాల్లోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీఓ వరప్రసాద్ రావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం, గూటుపల్లె గ్రామ పంచాయతీలను ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహించడమే కాకుండా ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణమూర్తి, రంగస్వామి, సర్పంచ్‌లు గుమ్మగాల్ల రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని గోరుమానుకొండ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గోరుమానుకొండ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు వీధులను, డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత పై గ్రామస్తులకు ఏఎన్ఎంలు, గ్రామ సర్పంచ్ అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పారబోయాలన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా క్రాస్ రోడ్‌లో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రాతఃకాలపూజ, యంత్ర అభిషేకం, ఆంజనేయస్వామికి ప్రీతిగా పవమాన హోమం, మూలమంత్ర జపం, మహా మంగళహారతి, మహాస్నపనము, స్వామివారి విగ్రహానికి విశేషమైన అభిషేకాలు, దేవతాహోమం, ధాన్యాధివాసం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

రైతుల భూములు తిరిగి వెనక్కి ఇవ్వాలి

కొలిమిగుండ్ల: మండలంలోని కల్వటాల, కోటపాడు గ్రామాల రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములు తిరిగి వెనక్కి ఇవ్వాలని సీపీఎం జిల్లా నాయకులు సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం నాయకులు దావీదు, రైతులతో కలిసి ప్రిజం సిమెంట్ కొనుగోలు చేసిన భూములను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతు 2008లో ప్రిజం సిమెంట్ యాజమాన్యం రెండు గ్రామాల నుంచి రెండు వేల ఎకరాలకు పైగానే రైతుల నుంచి భూములు కొనుగోలు చేసిందని, అయితే నేటికీ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టలేదన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయనే ఉద్దేశంతోనే రైతులు అప్పట్లో భూములు ఇచ్చారని గుర్తు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఐదేళ్లలోపు పరిశ్రమ ఏర్పాటు చేయకపోతే ఆ భూములు తిరిగి రైతులకు ఇవ్వాల్సి ఉందన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్నా నరసయ్య

సంజామల: మండల కేంద్రం సంజామలలోని బీసీ హాస్టల్‌ను శుక్రవారం బీసీ సంక్షేమ సహాయ అధికారి నరసయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా వంట, విద్యార్థుల గదులతో పాటు స్టోర్, వాస్‌రూమ్‌లను పరిశీలించారు.మోనూ ప్రకారం భోజనం పెడుతున్నారా ... లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.ప్రతి రోజు వసతి గృహానికి రావాలని, విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని వార్డెన్ మునిరాజుకు ఆయన సూచించారు.

బైక్‌లను ఢీకొట్టిన కారు... ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్: మద్యం మత్తులో పాతపేటకు చెందిన వినయ్ కుమార్ గౌడ్‌తోపాటు మరో వ్యక్తి కారు అజాగ్రత్తగా నడుపుతూ రెండు బైకులను ఢీకొట్టిన సంఘటన శుక్రవారం సాయంత్రం డోన్ పట్టణంలో చోటు చేసుకుంది. ఓ టీవీ చానల్ రిపోర్టర్‌గా పని చేస్తున్న కటార్‌కొండ గ్రామానికి చెందిన మధు చిన్నాన్న కుమారుడైన రాముతో కలసి పెళ్లిపత్రికలు పంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా తారకరామా నగర్ నుంచి కంబాలపాడు సర్కిల్ వైపు వెళ్తున్న కారు దూసుకొచ్చి ఢీకొట్టింది. మధుతో పాటు రాముకు తీవ్ర గాయాలవ్వగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. మరో బైకుపై ప్రయాణిస్తున్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారును నడిపిన యువకుడు పారిపోతుండగా స్థానికులు పట్టుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ ప్రమాదంపై పోలీసులు విచారణ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీవ్రతం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు



సామూహిక వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్న దృశ్యం



పాలిమేర పెద్దమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న వేదపండితులు

బనగానపల్లెరూరల్: శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటాడాయి. మహిళాలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ప్రముఖ శక్తి మాత ఆలయంగా ప్రసిద్ధిగాంచిన నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామానుజన్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా సాగింది. ప్రత్యేక మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ముస్తాబు చేసి వేద పండితులు అభిషేకం, సహస్రనామ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. వరలక్ష్మీ వ్రతం అనంతరం భక్తులకు తీర్థప్రసాదం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మద్దిలేటయ్యలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా చక్రవర్తి, ఆలయ ప్రధాన అర్చకులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తులసి మాలతో అర్చన, సహస్రనామ అర్చన తదితర పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామిని ఊరేగించారు. అనంతరం వేదపండితులు భక్త జనసందోహం మధ్య వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించి వ్రత మహత్యాన్ని వివరించారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పూజలో పాల్గొన మహిళలకు కళశం, శేష, వస్త్రము లు, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు.

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరలక్ష్మీదేవికి ప్రీతిపాత్రమైన శ్రావణమాస రెండవ వారాన్ని పురస్కరించుకుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేదపండితుల ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచామృతాభిషేకం, సామూహికంగా మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని జరిపారు.

డోన్ : మండలంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. వెంకటనాయునిపల్లె హనుమాన్ దేవాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ధార్మిక కార్యక్రమాలను నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శ్రీ వీరహనుమాన్ ఆలయంలో వైభవంగా వరలక్ష్మి సామూహిక పూజలు, కుంకుమార్చన, గోపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, సాహితీవేత్త డాక్టర్ సురేష్‌బాబు ప్రవచనాలను వినిపించారు. మహిళలు అమ్మవారి శ్రీచక్రానికి కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శీలం చంద్రశేఖర్, న్యాయవాదులు శీలం స్వర్ణలత, శీలం శ్రీలత, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, సత్సంగ్ ప్రముఖులు ఎల్లప్ప, రామక్రిష్ణ, చంద్రశేఖరయ్యలు, భజన మండలి సభ్యులు హాజరయ్యారు.

టీటీడీ ఆధ్వర్యంలో...

డోన్ టౌన్ : ప్రపంచ దేశాల్లో భారతదేశ సంస్కృతి, సంప్రదాయలకు ప్రాముఖ్యత ఉందని, వీటని ప్రతి ఒక్క రూ అనుసరించాలని టీటీడీ, విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కన్వీనర్ మల్లాది వెంకటకృష్ణారెడ్డి, సర్పంచ్ శీలం చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని వెంకటనాయునిపల్లెలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మహిళలు సామూహిక లక్ష్మీవ్రతం నిర్వహించారు.

అవుకు: మండల పరిధిలోని అమ్మవారి దేవాలయాల్లో భక్తులు శ్రావణ శుక్రవారం పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే మహిళలు ఆలయాలకు చేరుకొని వరలక్ష్మీ వ్రతం చేపట్టారు. మండలం రామాపురం గ్రామ పొలిమేరలో వెలసిన పొలిమేర పెద్దమ్మకు కరకల లక్ష్మి, కరకల మహేశ్వర రెడ్డి దంపతులు, అర్చక దంపతులు నాగమల్లేశ్వరి, రఘురాముడు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పంచలోహ కవచాన్ని బహూకరించారు. అనంతరం అన్నదానం చేశారు.



బేతంచెర్ల మద్దిలేటిస్వామి క్షేత్రంలో వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు



వరలక్ష్మి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాజ్‌కుమార్

ప్యాపిలి: ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహన చోదకులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ రాజ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన పట్టణంలో డ్రైవర్లు, ద్విచక్రవాహన చోదకులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్లో పాటించాల్సిన నిబంధనలను ఎస్ఐ వివరించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ఆటో డ్రైవర్లు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు, వాహనాల్లో తరలించే సరుకుల బిల్లులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అనుమతి లేని వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు.

మండల్ జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి



మండల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : బీసీలకు రిజర్వేషన్లు సాధించి పెట్టిన బీపీ మండల్ జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సమయుక్త కార్యదర్శి ఏఈ నాగరాజు కోరారు. పట్టణంలోని ముక్తేశ్వర ఆలయంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీపీ మండల్ బీసీల అభివృద్ధి కోసం చేసిన త్యాగాలను నాగరాజు గుర్తు చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ అధ్యక్షులు మల్లికార్జున స్వామి, మహిళా అధ్యక్షులు వనం అక్కిదేవి, నాయకులు మద్దయ్య, రాములు, వెంకట్రాముడు, ఊటకొండ మద్దయ్య పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు



నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవ తీసుకొని మండల ప్రజల సౌకర్యార్థం ఫంక్షన్ హాల్ నిర్మించాలని రామ్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు యాజమాన్యం రూ.3కోట్లకు పైగానే సీఎస్ఆర్ నిధులను కంపెనీ కేటాయించింది. డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వివాహాలు, ఇతర శుభకార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా వసతులు కల్పించనున్నారు. విశాలమైన హాల్, డైనింగ్ హాల్, వంటగదులు, టాయ్‌లెట్లు,వధూవరులకు సంబంధించిన గదులతో పాటు పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ఫంక్షన్ హాల్ ఏర్పాటు కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామం కొత్తపేట కాలనీలో గడప గడప కార్యక్రమం కింద మంజూరైన రూ.7.50లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపేట కాలనీలోని రంగమ్మ ఇంటి నుంచి వెంకటేశ్వర్లు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో గ్రామాలు పట్టణాలతో సమానంగా అభివృద్ధి దిశలో నడుస్తున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొనేటి సుమలత, ఉపసర్పంచ్ శివకృష్ణ, అల్లెసురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం ముస్లిం సోదరుల ప్రార్థనలు



వర్షం కోసం ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

ప్యాపిలి:వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురవాలని కోరుతూ పట్టణ ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మసీదులో ప్రార్థనల అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణానికి చేరుకుని మత గురువు మహబూబ్ ఖాన్ ఆధ్వర్యంలో వర్షం కోసం నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అల్లాను వర్షం కురిపించాలని వేడుకున్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు మైదాన ప్రాంతంలో ప్రత్యేకంగా నమాజ్ నిర్వహిస్తే వర్షం కురుస్తుందని తమ విశ్వాసమని వారు తెలిపారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

డోన్ : స్థానిక వేంకటేశ్వర ఆలయంలో గీతా యోగాసన సభ్యులు వర్షాల కోసం శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, కార్యదర్శి మాకం బాలు తదితర సభ్యులు వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ గుడిచుట్టూ పొర్లుదండాలు సమర్పించారు.

ప్రశాంతంగా సోషల్ ఆడిట్



బహిరంగ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : గత ఆర్థిక సంవత్సరం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై నిర్వహించిన సోషల్ ఆడిట్ బహిరంగ సమావేశం ప్రశాంతంగా జరిగింది. స్థానిక జాడీల ఫ్యాక్టరీ ఆవరణలో నిర్వహించిన మండల స్థాయి బహిరంగ సమావేశాన్ని ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ పీడీ రామచంద్రారెడ్డి సమక్షంలో నిర్వహించారు. 01-04-2022 నుంచి 31-03-2023 వరకు డీఆర్‌పీలో రూ.6కోట్లు, పంచాయతీ రాజ్ రూ.2కోట్లు, ఆర్‌డబ్ల్యూస్ రూ.12లక్షలు, సర్వశిక్ష అభియాన్ రూ. 4లక్షలు,సోషల్ ఫారెస్టు రూ.3,53 లక్షలు, సీఎస్ఐ రూ1.12కోట్లు చొప్పున మొత్తం రూ.11 కోట్ల వరకు పనులు చేపట్టారు. ఈ పనులపై ఇప్పటికే సోషల్ ఆడిట్ సభ్యులు తనిఖీలు నిర్వహించి వివిధ రకాల తప్పిదాలపై రూ.77వేలు రికవరీకి సిఫారసు చేశారు. అలాగే కమలాపురం గ్రామంలో భార్య, భర్తలకు వేర్వేరు జాబ్ కార్డులు ఉండడంపై పీడీ రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీలు అన్వరాబేగం, శ్రీవిద్య, బాలాజీ నాయక్, ఎస్ఆర్‌పీ ఆడిటర్ కన్నారెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి సంక్షేమ ఫలాలు అందజేయాలి

● డీఎస్‌డబ్ల్యూఓ చింతామణి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌డబ్ల్యూఓ చింతామణి

బనగానపల్లెరూరల్: ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని, ఆ దిశగా ప్రతి విద్యార్థికి సంక్షేమ పథకాలు అందజేయాల్సిన బాధ్యత సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్స్, వార్డెన్లపై ఉందని జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారిణి(డీఎస్‌డబ్ల్యూఓ) చింతామణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని పొదుపు భవనంలో శుక్రవారం బేతంచర్ల, డోర్నిపాడు, పాణ్యం, బనగానపల్లె, కొలిమిగుండ్ల, ప్యాపిలి మండలాల హాస్టల్ వార్డెన్‌లు, గ్రామ సచివాయాల సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో ఆమె సమావేశం నిర్వహించారు. జగనన్న విద్యా, వసతి దీవెనలు, అమ్మఒడి తదితర పథకాలపై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్‌డబ్ల్యూఓ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన జగనన్న విద్యాదీ వెనకు సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు సంబంధించి ఆధార్ నంబరుతో బ్యాంకు ఖాత లింక్ చేయాలని, ఈకేవైసీ ఈ నెల 27వతేదీలోపు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి అందేలా వెల్ఫేర్ అధికారులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా మండలాల వారీగా విద్యార్థులకు సంబంధించి పెండింగ్ ఈకేవైసీ, బ్యాంకు ఖాతాలు తదితర వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ దిలీప్‌బాషా, హాస్టల్ వార్డెన్లు మహమ్మ రఫీ, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, సాగర్, ముంతాజ్ బేగం, లక్ష్మీభాయి, అమర్‌నాథ్, మధు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్యాపిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక సర్వే నంబర్ 4-10లో ఉన్న 10 సెంట్ల స్థలాన్ని సోషల్ వెల్ఫేర్ డీడీ చింతామణి శుక్రవారం పరిశీలించారు. ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఈ స్థలం అనువుగా ఉంటుందని, జిల్లా అధికారకులకు నివేదిక అందజేస్తామని ఈ సందర్భంగా డీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి



మృతురాలు పద్మావతి

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం మఠంలోని గిలకల బావిలో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పద్మావతి (36) కొన్నేళ్ల క్రితం భర్త నరసింహులు మృతిచెందడంతో ఒంటరిగా ఉంటూ దేవస్థానంలో స్వీపర్‌గా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. అయితే శుక్రవారం స్నానం చేసేందుకు ఓ వ్యక్తి బావి దగ్గరకు వెళ్లగా బావిలో శవం కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని బయటకు తీయగా స్వీపర్‌గా పనిచేసే పద్మావతిగా గుర్తించారు. సీసీ కెమారాలు పరిశీలింగా పద్మావతి ఒక్కతే బావి వద్దకు వెళ్లినట్లు కనిపించింది. కాగా మఠంలో పీఠాధిపతి ఉండటంతో పాటు శ్రావణ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఉండగా ఎవరూ చూడకుండా బావిలో ఎలా పడుతుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి తల్లి రామక్క ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరసింహులు తెలిపారు.

ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌పై ఆర్డీఓ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్ : స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌పై శుక్రవారం సాయంత్రం బీఎల్ఓలతో ఆర్డీఓ వెంకటరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరిగి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఇంటిలో ఉన్న ఓటర్లను పాత జాబితాలో ఉన్న పేర్లను సరి చూడాలన్నారు. ఎవ్వరైనా ఇంటిలో లేకున్నా వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా తనిఖీల్లో ఏలాంటి పొరపాట్లు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తాహశీల్దార్ విద్యా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సక్రమంగా చేపట్టాలి

ప్యాపిలి: ఓటరు జాబితాను సక్రమంగా చేపట్టాలని ఆర్డీఓ వెంకటరెడ్డి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. మృతి చెందినా, వలస వెళ్లిన వ్యక్తుల పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉన్న వారితో మాట్లాడి అవసరమైన చోట మాత్రమే జాబితాలో వారి పేర్ల ఉంచాలని సూచించారు.

ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

డోన్‌టౌన్ : రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రమాదాలు చోటు చేసుకోకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డోన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ సూచించారు. స్థానిక శ్రీసుధ జూనియర్ కళాశాలలో శుక్రవారం రోడ్డు నియమాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ డిస్‌ప్లే ద్వారా రోడ్డు భద్రతకు సంబంధించిన సూచికల బోర్డులు, రైల్వే క్రాసింగ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయం సిబ్బంది విజమ్, శ్రీనివాసులు, కళాశాల ప్రిన్స్‌పాల్ యోగానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరిగిన రైల్వే గేటు !

డోన్ టౌన్ : పట్టణంలోని కర్నూలు రైల్వే గేటు విరిగి పోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మధ్యాహ్నం రైలు వస్తుండగా రైల్వే గేట్లు వేస్తున్న సమయంలో ఒకటి విరిగి పోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గేట్ల నాణ్యత సరిచూసుకోనందునే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు రైల్వే అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.